


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 09-04-2024 సంపుటి : 06 సంచిక : 209 పేజీలు : 8 వెల : రూ 3-00



## పేదల హక్కులను కాంగ్రెస్ హరించింది..

### గత పదేళ్లలో దేశం దూసుకుపోతుంది: ప్రధాని మోదీ

మహారాలీ , మావోయిస్టుల కంచుకోట బస్తరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రధాని నరేంద్ర మోదీ. చత్తీస్‌గడ్‌లో గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొమ్మును లూటీ చేసిందని ఆరోపించారు మోదీ.తాను అవినీతిపై యుద్ధం ప్రకటిస్తే విపక్షాలు మోదీ గ్యారంటీలపై విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా అవినీతిని అంతం చేస్తానని అన్నారు.ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో జరిగిన విజయ్ సంకల్ప్ శంఖనాద్ మహారాలీలో ప్రసంగించిన ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. పేదల గురించి కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ నేతలు పేదల హక్కులను లాక్కున్నారని ఆరోపించారు. పేదలకు హక్కులు కల్పించి సగౌర్వంగా జీవించేలా చేశామన్నారు. ప్రస్తుతం దేశం మొత్తం మరోసారి మోదీ సర్కార్ అంటున్నారు. దేశంలోని ప్రతి పేదవాడికి నేను అండగా ఉంటానని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు..బీజేపీ ప్రభుత్వం పేదల కోసం ఒక్కొక్కటిగా పథకాలు తీసుకువచ్చి వారి హక్కులను కల్పించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి ఫలితంగానే దేశంలో 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. పేదవారి ప్రతి ఆందోళనను తొలగించే వరకు విశ్రమించనని నిర్ణయించుకున్నానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రారంభించామన్నారు. ఆయుష్మాన్ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు.దశాబ్దాల తర్వాత దేశం సుస్థిరమైన, బలమైన బీజేపీ ప్రభుత్వాన్ని చూసిందని ప్రధాని మోదీ అన్నారు. పేదల సంక్షేమమే మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. స్వాతంత్ర్యానంతరం పేదల అవసరాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు దశాబ్దాలుగా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ఎప్పుడూ పేదల గురించి పట్టించుకోలేదు, వారి సమస్యలను అర్థం చేసుకోలేదు. కాంగ్రెస్ కుటుంబంలోని ధనవంతులకు ద్రవ్యోల్బణం అంటే అర్థం కాలేదన్నార ప్రధాని మోదీ.పేదలకు ఉచితంగా రేషన్, వ్యాక్సిన్ ఇచ్చామని ప్రధాని మోదీ అన్నారు. కరోనా కాలాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రజలు భారతదేశం ఎలా మనుగడ సాగిస్తుందని చెప్పేవారు? కాంగ్రెస్ హయాంలో దేశంలో వ్యాక్సిన్ రావడానికి దశాబ్దాలు పట్టేది. భారత దేశంలోని ప్రతి పేదవాడికి అండగా ఉంటానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. పేదలకు ఉచితంగా వ్యాక్సిన్, ఉచితంగా రేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. 2014కి ముందు లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీ నుంచి ఒక్క రూపాయి వస్తే, అదీ గ్రామాలకు 15 పైసలు మాత్రమే వచ్చేవి. మిగిలిన 85 పైసలను కాంగ్రెస్ వారే కొల్లగొట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ దోచుకునే ఈ వ్యవస్థను ఆపానని స్పష్టం చేశారు మోదీ. అవినీతిపరుల నల్లధనాన్ని అడ్డుకున్నానని, . బీజేపీ ప్రభుత్వం తన పదేళ్లలో రూ.34 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పంపించినట్లు ప్రధాని మోదీ తెలిపారు.

## 11వ రోజు మేమంతా సిద్ధం బస్సుయాత్రలో సీఎం జగన్..



### పెన్షన్‌పై అవ్వాతాతలతో ముఖాముఖి..


ఒంగోలు,ఏప్రిల్8: ఎన్నికలు ముగిసి అధికారంలోకి వచ్చిన తరువాత వాలంటీర్ల వ్యవస్థ పునరుద్ధరణపై తొలిసంతకం చేస్తానని ఏపీ సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. ప్రకాశం జిల్లాలో కొనసాగుతున్న మేమంతా సిద్ధం బస్సుయాత్ర సందర్భంగా పింఛన్‌దారులతో నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడారు. ఎన్నికల లబ్ది కోసం అబద్దపు మాటలతో మోసం చేసే నాయకులను ప్రజలెవ్వరూ నమ్మవద్దని కోరారు. చంద్రబాబు కూటమి నోటికొచ్చిన అబద్దాలతో ప్రజల వద్దకు వస్తున్నారని వారితో జాగ్రత్తగా ఉండాలని కోరారు. చంద్రబాబుకు ఓటేస్తే పులినోట్లో తలపెట్టినట్టేనని పేర్కొన్నారు. జనాభా ప్రకారం అత్యధిక పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని వెల్లడించారు. నెలకు రూ. 2వేల కోట్లు పెన్షన్లుకే ఇస్తున్నామని అన్నారు. పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా ఇంటివద్దకే వచ్చి డబ్బు ఇచ్చేందుకు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చామని స్పష్టం చేశారు. మరోసారి అధికారంలోకి వచ్చిన తరువాత వాలంటీర్ వ్యవస్థను మరింత పటిష్టపరుస్తామని చెప్పారు. ఏనాడు కూడా పేదల గురించి ఆలోచించని చంద్రబాబుకు ఓటేసి మోసపోవద్దని సూచించారు. రాజకీయాలు ఇప్పుడు పాతాళానికి వెళ్లిపోయాయి. విలువలులేని, విశ్వసనీయతలేని రాజకీయాలు వచ్చేశాయి. వీటిని మార్చేందుకు మీ బిడ్డగా అడుగులు ముందుకు వేస్తున్నాను అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.అవ్వాతాతల గురించి పట్టించుకోవాలంటే ప్రేమ ఉండాలి. చంద్రబాబుకు అవ్వాతాతల మీద ప్రేమే లేదన్నారు. చంద్రబాబుకు ఓటు వేస్తే పులి నోట్లో తల పెట్టినట్లే అని సూచించారు. కాగా, సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సుయాత్ర పదకొండో రోజు ప్రకాశం జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా సీఎం జగన్ అక్కడ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ..'గత ప్రభుత్వంలో ఎంత మందికి పెన్షన్ వచ్చేది. అప్పట్లో పెన్షన్ ఎంత వచ్చేదో మీకు గుర్తుందా?. కొన్ని విషయాలు ఆలోచించాలని అవ్వాతాతలను కోరుతున్నాను. గత ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్ వచ్చేది. మీ బిడ్డ ప్రభుత్వంలో 66 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నాం. ఇప్పుడు మీ బిడ్డ ప్రభుత్వంలో వచ్చిన మార్పు గమనించండి. అవ్వాతాతలు పెన్షన్ కోసం అవస్థలు పడకూడదనేది నా కోరిక. అవ్వాతాతల ఆత్మగౌరవం గురించి నేను ఆలోచన చేశాను. దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చాం. వాలంటీర్లతో నేరుగా అవ్వతాతల ఇంటికే పెన్షన్ పంపించాం. 56 నెలలుగా మన ప్రభుత్వం ప్రతీ నెల ఒకటో తేదీన ఉదయమే పెన్షన్ అందించాం. గత ప్రభుత్వం అరకొరగా పెన్షన్ ఇస్తూ ఉంటే దానిని మార్పు చేశాం. అర్హత ఉంటే చాలు ప్రతీ ఒక్కరికీ పెన్షన్ అందించాం. ప్రతీ గ్రామంలో ఒక సచివాలయం ఏర్పాటు చేశాం. చంద్రబాబు ఏ ఒక్కరోజు కూడా మీ బిడ్డలాగా అవ్వాతాతల గురించి ఆలోచన చేయలేదు. అవ్వాతాతల గురించి పట్టించుకోవాలంటే ప్రేమ ఉండాలి. 14 ఏళ్లు సీఎంగా చేశానని చంద్రబాబు చెబుతుంటారు. ఏ రోజైనా చంద్రబాబు మీ గురించి ఆలోచన చేశాడా?. రాజకీయాలు ఇప్పుడు పాతాళానికి వెళ్లిపోయాయి. విలువలులేని విశ్వసనీయతలేని రాజకీయాలు వచ్చేశాయి. వీటిని మార్చేందుకు మీ బిడ్డగా అడుగులు ముందుకు వేస్తున్నాను. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో అది ఇస్తాం, ఇది ఇస్తాం అని చెప్పారు. ఎన్నికల తర్వాత ఆ మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేశారు. మీ బిడ్డకు అబద్దాలు చెప్పడం, మోసం చేయడం రాదు. చంద్రబాబు, వారి కూటమిలా నోటికొచ్చిన అబద్దాలు చెప్పలేను. మీ బిడ్డ ఏదైనా చెప్పాడంటే చేసి చూపిస్తాడు. జనాభా ప్రకారం అత్యధిక పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం మనదే. రూ.3వేలు ఇస్తున్న రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదు. నెలకు రూ.2వేల కోట్లు పెన్షన్లలకే ఇస్తున్నాం. చంద్రబాబు మోసం చేసేందుకు ఎంతైనా ఇస్తానంటాడు జాగ్రత్తగా ఉండాలి. మీ బిడ్డ ప్రభుత్వంలో 99 శాతం హామీలను అమలు చేశాం. రంగు రంగుల హామీలతో వస్తున్న చంద్రబాబును నమ్మొదు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను అసలు నమ్మకండి. చంద్రబాబుకు ఓటు వేస్తే పులి నోట్లో తల పెట్టినట్లే' అని అన్నారు.



## రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ ఉగాది శుభాకాంక్షలు



అమరావతి: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సరాది సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికి శుభాకాంక్షలు తెలిపారు.శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు, విజయాలు సిద్ధించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాలని పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని అన్నారు. కొత్త సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.




రాష్ట్ర ప్రజలకు నారా చంద్రబాబు నాయుడు క్రోది నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసంవత్సరంలో ప్రజలు కష్టాల కడలి నుండి విముక్తి పొంది సుఖశాంతులతో జీవించేలా ఆభగవంతుడు ఆయురారోగ్యాలు కలుగ జేయాలని కోరుకుంటూ.... మీ బాబు

## డేంజర్ బెల్స్ మోగిస్తున్న నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్..

### పొంచి ఉన్న తాగునీటి గండం!

తెలుగు రాష్ట్రాల్లోని వేలాది గ్రామాలకు తాగునీటిని అందించిన నాగార్జున సాగర్ అడుగంటుతోంది. దీంతో నాగార్జునసాగర్ లో ప్రమాదకర స్థాయి డెడ్ స్టోరేజీకి నీటి నిల్వలు పడిపోతుండడంతో డేంజర్ బెల్స్ ను మోగిస్తోంది.సాగర్ కృష్ణా జలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటి గండం పొంచి ఉంది.తెలుగు రాష్ట్రాల వరప్రదాయినిగా ఉన్న నాగార్జునసాగర్ తీవ్ర వర్షాభావంతో వట్టి పోయింది. ఆశించిన స్థాయిలో వర్షాలు లేక సాగర్ నిండుకుంటోంది. దీంతో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ఖరీఫ్, రబీ సీజన్ లో ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించింది. మరోవైపు వేసవి కాలం ప్రారంభం కావడంతో సాగర్ కృష్ణా జలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో నీటి మంచినీటి ఎద్దడి తీవ్రమవుతోంది.590 అడుగుల గరిష్ట నీటి స్థాయి మట్టం కలిగిన నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో ప్రస్తుతం 511 అడుగుల నీటిమట్టంతో 133.7 టీఎంసీల నీరు ఉంది. సాగర్ డెడ్ స్టోరేజ్ 510 అడుగులు 131 టీఎంసిలుగా నిర్ణయించడం జరిగింది. అయితే డెడ్ స్టోరేజ్ కి కేవలం మూడు అడుగుల దూరంలోనే ఉంది సాగర్ డ్యామ్. దీంతో నాగార్జునసాగర్‌లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. గత ఏడాది ఇదే సమయంలో 528.30 అడుగులతో 164 టీఎంసీల నీరు ఉంది. గత ఏడాదితో పోల్చితే నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో 31 టీఎంసీల నీటి లభ్యత తక్కువగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో నీటిమట్టం డెడ్ స్టోరేజ్ కి చేరుకుంటోంది. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుండి హైదరాబాద్ జంట నగరాలు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటి సరఫరా జరుగుతోంది. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి పుట్టంగండి వద్ద ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రెండు మోటార్లతో 900 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయర్ కు పంపింగ్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి జంట నగరాలకు 550 క్యూసెక్కులు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 597 గ్రామాలకు రోజుకు 25 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేయాల్సి వస్తోంది.ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో నీటి లభ్యత తక్కువగా ఉండడంతో తాగునీటికి ప్రమాదం పొంచి ఉంది. సాగర్ నీటిమట్టం డెడ్ స్టోరేజ్ కి చేరువలో ఉంది. డెడ్ స్టోరేజీకి ఎగువన ఉన్న కేవలం రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రస్తుతం అయితే ఏప్రిల్ నెల వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రిజర్వాయర్లలో తాగునీటికి సరిపడా నీరు ఉంది. మే, జూన్, జూలై మూడు నెలలకు తాగునీటికి కటకట ఏర్పడే పరిస్థితి ఉంది.ఇక హైదరాబాద్ జంట నగరాలకు మంచినీటి సరఫరాను ప్రస్తుతం పుట్టంగండి ఎత్తిపోతల పథకం ద్వారా జరుగుతోంది. 510 అడుగుల డెడ్ స్టోరీకి దిగవకు నీటిమట్టం పడిపోతే పంపింగ్ కష్టమే అవుతుంది. నీటి మట్టాలు 510 అడుగుల దిగువనకు చేరినప్పుడు బ్యాక్ వాటర్ వద్ద జీరో పాయింట్ నుంచి డ్రెడ్జింగ్ ప్రక్రియతో భారీ మోటార్లతో పంపింగ్ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు 1450 కోట్ల రూపాయలతో సుంకిశాల వద్ద మూడోదశ పైపు పనులు కూడా కొనసాగుతున్నాయి. మంచినీటి ఎద్దడిని నివారించేందుకు అత్యవసర పనులను చేపడుతున్నారు.మరోవైపు ఏపీ తాగునీటి అవసరాలకు ఐదు టీఎంసీల నీటిని కుడి కాలువ ద్వారా విడుదల చేస్తున్నారు. దీంతో రెండు రోజుల్లో డెడ్ స్టోరేజ్ కి చేరుకునే ప్రమాదం ఉంది. భవిష్యత్ అవసరాలకు శ్రీశైలం, జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునే అవకాశం కూడా లేదు. ఇప్పటికే ఆ రెండు ప్రాజెక్టులు వట్టిపోయి ఉన్నాయి. మరో మూడు నెలల పాటు తాగునీటి అవసరాలు ఎలా తీర్చుకోవాలని దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు.అటు నంద్యాల జిల్లా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సాగు త్రాగునీరందించే శ్రీశైలం జలాశయం ఇప్పుడు నీటి నిల్వలు తగ్గిపోయి వెలవెలబోతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అవసరమైన 215 టీఎంసీలకు గాను.. ఇప్పుడు మిగిలింది 34 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# విజయనగరం నుంచి రఘురాముడు..?



విజయనగరం, ఏప్రిల్ 8 రఘురామకృష్ణంరాజు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తారా? చేస్తే ఎక్కడినుంచి చేస్తారు? ఎమ్మెల్యే గానా? ఎంపీ గానా? అసలు ఆయనకు సీటు ఇచ్చే ఛాన్స్ ఉందా? చంద్రబాబు సర్దుబాటు చేయగలరా? ఆ పరిస్థితి ఉందా? అన్న బలమైన చర్చ నడుస్తోంది. రఘురామకృష్ణం రాజు టిడిపిలో చేరిన సంగతి తెలిసిందే. బిజెపి టికెట్ కోసం చివరి వరకు వేచి చూసిన ఆయనకు.. అగ్రనేతలు షాక్ ఇచ్చారు. ఏపీ బీజేపీలో జరిగిన అంతర్గత వ్యవహారంలో పెద్దలు చేతులెత్తేశారు. రఘురామకృష్ణంరాజు ఆశిస్తున్న నరసాపురం స్థానంలో.. భూపతి రాజు శ్రీనివాస వర్మ కు సీటు కేటాయించారు. అయితే ఇన్ని రోజులు తమకోసం కృషిచేసిన రఘురామను విడిచిపెడితే.. అంతిమంగా జగన్ ది పై చేయి అవుతుందని చంద్రబాబు భావించారు. రఘురామరాజును టిడిపిలో చేర్పించారు. ఎక్కడో ఒకచోట సీటు కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నారు.పొత్తులో భాగంగా టిడిపికి మిగిలిన 141 అసెంబ్లీ, 17 పార్లమెంటు స్థానాల్లో చంద్రబాబు అభ్యర్థులను ప్రకటించారు. మరోవైపు రఘురామరాజుకు సీటు కేటాయిస్తుందనుకున్న బిజెపి హ్యాండిచ్చింది. జనసేన ఇప్పటికే కొన్ని సీట్లను త్యాగం చేసింది.

ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు రఘురామ కోసం రంగంలోకి దిగారు. నరసాపురం ఎంపీ సీటును బిజెపి వదులుకుంటే.. దాని స్థానంలో ఏలూరు పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి విడిచిపెడతామని చంద్రబాబు ఆఫర్ చేశారు. కానీ బిజెపి పెద్దలనుంచి సానుకూలత రాలేదు. దీంతో చంద్రబాబు పునరాలోచనలో పడ్డారు. ఉండి ఎమ్మెల్యే సీటును ఇచ్చేందుకు ఆలోచన చేశారు. అయితే ఉండిలో టిడిపికి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు. గత ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో మంతెన రామరాజు గెలుపొందారు. ఆయనను తప్పిస్తే సహకరించమని టిడిపి శ్రేణులు తేల్చి చెప్పాయి. అయితే తాజాగా రఘురామ మీడియా ముందుకు వచ్చారు. తన మనసులో ఉన్న మాటను బయటపెట్టారు. విజయనగరం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయడానికి ఆసక్తిగా ఉందని చెప్పుకొచ్చారు.విజయనగరం పార్లమెంట్ స్థానానికి గత రెండు ఎన్నికల్లో పూసపాటి అశోక్ గజపతిరాజు పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో గెలిచిన అశోక్ కేంద్ర మంత్రి కూడా అయ్యారు. గత ఎన్నికల్లో రెండోసారి పోటీ చేశారు. స్వల్ప మెజారిటీతో ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో వయోభారంతో తప్పుకున్నారు. ఆయన స్థానంలో బీసీ నేత అయిన కలిశెట్టి అప్పలనాయుడును చంద్రబాబు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయన ముమ్మర ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఇప్పుడు విజయనగరం రఘురామకృష్ణం రాజుకు కేటాయిస్తారా? అందుకు కలిశెట్టి ఒప్పుకుంటారా? అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. విజయనగరం పార్లమెంట్ స్థానం పరిధిలో తూర్పు కాపులు అధికం. అశోక్ గజపతిరాజు విషయంలో తూర్పు కాపులు సర్దుబాటు చేసుకున్నారు. మంచి వ్యక్తి కావడంతో ఆయన వైపు మొగ్గు చూపారు. కానీ ఇదే సీటుకు ఎక్కడో ఉన్న రఘురామకృష్ణం రాజును తెచ్చి పెడితే ఒప్పుకునే స్థితిలో తూర్పు కాపులు లేరు. అయితే చంద్రబాబు మాటను కలిశెట్టి ఒప్పుకుంటారు. కానీ ఆ సామాజిక వర్గం మాత్రం ఒప్పుకునే పరిస్థితి ఉండదు. ఒకవేళ బలవంతంగా రుద్దినా.. గెలుపు పై స్పష్టమైన ప్రభావం చూపుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి రఘురామ విషయంలో చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# వేమిరెడ్డి... యూ టర్న్ తీసుకుంటున్నారా

నెల్లూరు, ఏప్రిల్ 8, నెల్లూరు రాజకీయాల్లో సంచలనం నమోదు కానుందా? టిడిపిలోకి వెళ్లిన నేతలు తిరిగి వైసీపీలోకి రానున్నారా? అక్కడ ఇమడలేక పోతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ప్రధానంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులు యూటర్న్ తీసుకోనున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. నామినేషన్ల దాఖలు చేసే సమయానికి వారు వైసీపీలోకి తిరుగు ముఖం పట్టనున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే నెల్లూరు రాజకీయాల్లో సమీకరణలు శరవేగంగా మారనున్నాయి. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి. కొద్ది రోజుల కిందటే వారు చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు.వైసీపీ ఆవిర్భావం నుంచి వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి జగన్ వెంట అడుగులేస్తూ వచ్చారు. గత రెండు ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. అందుకే జగన్ ఆయనకు రాజ్యసభ చాన్స్ ఇచ్చారు. అయితే ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వేంరెడ్డి దంపతులు వైసీపీని వీడారు. ముఖ్యంగా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తీరుతోనే వారు పార్టీకి దూరమైనట్లు తెలుస్తోంది. పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలిచే వేమిరెడ్డి కంటే.. అనిల్ కుమార్ యాదవ్ కు ప్రాధాన్యం ఇవ్వడంతో ఆ దంపతులు నొచ్చుకున్నారు. మృదుస్వభావం కలిగిన వారు క్షణికావేశంతో పార్టీకి దూరమయ్యారు. అయితే వారి పట్ల వైసీపీ శ్రేణులు ఇప్పటికీ సానుభూతిగా ఉన్నాయి. వాస్తవానికి వైసిపి నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా ప్రభాకర్ రెడ్డి పేరును ఎప్పుడో ఖరారు చేశారు. కానీ నెల్లూరు సిటీ అసెంబ్లీ అభ్యర్థిగా తన భార్య ప్రశాంతి రెడ్డి పేరును పరిశీలించాలని ప్రభాకర్ రెడ్డి కోరారు.కానీ అనూహ్యంగా డిప్యూటీ మేయర్ ఖలీల్ పేరును జగన్ ఖరారు చేశారు. ఖలీల్ అనిల్ కుమార్ యాదవ్ ప్రధాన అనుచరుడు. ఈ సీటు విషయంలో అనిల్ తాను అనుకున్నది సాధించుకున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిని అయిన తనను కనీసం సంప్రదించకుండా.. ఖలీల్ పేరును ఖరారు చేయడాన్ని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జీర్ణించుకోలేకపోయారు.అయితే అప్పటికే నెల్లూరు జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు వైసీపీకి దూరమయ్యారు. తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో వేంరెడ్డి చూపు తెలుగుదేశం వైపు పడింది.అటు తెలుగుదేశం నుంచి కూడా మంచి ఆఫర్ వచ్చింది. వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డికి నెల్లూరు పార్లమెంట్ సీటు, ఆయన భార్య ప్రశాంతి రెడ్డికి కోవూరు సీటును చంద్రబాబు కేటాయించారు. ప్రస్తుతం ఆ దంపతులు ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారు తిరిగి వైసీపీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి పేరును ప్రకటించారు. కానీ నామినేషన్ల ఘట్టం ప్రారంభమయ్యే నాటికి వేంరెడ్డి దంపతులు తిరిగి వైసిపిలోకి వస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే అటువంటిదేమీ లేదని.. ఇది వైసీపీ ఆడుతున్న మైండ్ గేమ్ అని వేంరెడ్డి అనుచరులు కొట్టి పారేస్తున్నారు. వైసిపి వర్గాల్లో మాత్రం ఇదో చర్చగా మారింది. అయితే రాజకీయాల్లో ఈ తరహా మైండ్ గేమ్ సహజం.

# విశాఖలో జీవీఎల్ ఫ్లెక్సీల కలకలం


విశాఖపట్టణం, ఏప్రిల్ 8జీవిఎల్‌కు మద్దతుగా విశాఖలో వెలసిన ఫ్లెక్సీలు తీవ్ర కలకలం సృష్టి?స్తున్నాయి.విశాఖ ఎంపీ టికెట్‌పై జీవీఎల్ కూల్ అయినట్టే కనిపించారు. టికెట్ ఇక తనకు రాదు అని ఫిక్స్ అయ్యారు. ఇప్పుడు కాకపోయినా ఇంకెప్పుడైనా తానే విశాఖలో పోటీలో ఉంటానన్నారు. ఆల్ ఆఫ్ సడెన్.. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అనే స్టాండ్ తీసుకున్నట్టున్నారు. ఈ క్రమంలోనే జీవీఎల్ కు విశాఖ ఎంపీ సీటు కేటాయించాలంటూ వారం రోజులు గా పలు రకాల కార్యక్రమాలు జరుపు తున్నారు ఆయన మద్దతుదారులు. విశాఖ లాంటి బీజేపీకి బలం ఉన్న, గతంలో విజయం సాధించిన చోట టికెట్ కేటాయించకపోవడం అన్యాయం అంటూ ప్రెస్ మీట్ లు, ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలను కలవడం లాంటి యాక్షన్ ప్లాన్ కొనసాగుతూ ఉంది. విశాఖ పార్లమెంట్ 7 నియోజ కవర్గాల్లో ఫ్లెక్సీలు కట్టి నిరసన తెలిపింది జన జాగరణ సమితి అనే ఓ సంస్థ. మన విశాఖ అభివృద్ధి కోసం నిబద్ధతతో పని చేస్తూ పదే పదే పార్లమెంట్ లో విశాఖ గళం వినిపించిన బీజేపీ సీనియర్ నాయకులు జీవీఎల్ నరసింహారావుకు విశాఖ ఎంపీ సీటు కేటాయించక పోవడం అన్యాయం అన్నది వాళ్ళ అవేదన. ఆ తరహా ఫ్లెక్సీలను పీఎం పాలెం క్రికెట్ స్టేడియం, మద్దిలపాలెం జంక్షన్ లో ఏయూ ఇంజనీరింగ్ గేటు, సిరిపురం జంక్షన్ లో, జగదాంబ జంక్షన్ లో, ద్వారకా నగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా, గురుద్వారా జంక్షన్ లో, ఎన్ఏడి జంక్షన్ లో, గాజువాక జంక్షన్ లో కట్టడం జరిగింది.జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ ఒరిజినల్ బీజేపీ సీనియర్ నాయకుడిగా జీవీఎల్ నరసింహారావుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా కేంద్ర మంత్రులు అందరితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందువల్ల విశాఖ అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు ఇక్కడ ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో సమస్యలను పరిష్కరించాలని అనేక మార్లు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. కొన్ని సమస్యలను పరిష్కరించిన విషయం కూడా విశాఖ వాసులందరికీ బాగా తెలుసనీ, మనదేశంలో కేంద్ర మంత్రులు అత్యధికంగా పర్యటనలు చేసిన పార్లమెంట్ నియోజకవర్గం ఏదైనా ఉంది అంటే అది కేవలం విశాఖపట్నం మాత్రమే అన్నారు. జీవీఎల్ విశాఖ అభివృద్ధి పట్ల నిబద్ధతతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కేంద్ర మంత్రులను విశాఖ పర్యటనకు ఆహ్వానించడం జరిగిందన్నారు.

# మంగళగిరిలో జగన్ వ్యూహం...



గుంటూరు, ఏప్రిల్ 8, మంగళగిరిలో నారా లోకేష్ పరిస్థితి ఏంటి? ఆయన గెలుపొందుతారా? గత ఎన్నికల మాదిరిగా ఓటమి తప్పదా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో బలమైన చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లో సిట్టింగ్ మంత్రిగా ఉంటూ మంగళగిరి నియోజకవర్గ నుంచి పోటీ చేసిన లోకేష్ ఓడిపోయారు. వైసీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. దీంతో లోకేష్ పొలిటికల్ కెరీర్ పైనే మాయని మచ్చ పడింది. ప్రత్యక్ష ఎన్నికల్లో తొలిసారిగా బరిలో దిగిన యువనేతకు ఓటమి ఎదురైంది. ఆదిలోనే పెద్ద దెబ్బ తగిలింది. ఇక లోకేష్ పుంజుకోగలరా? అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అయితే మంగళగిరి నియోజకవర్గంలో ఓటమి ఎదురైనా.. పోయిన చోటే వెతుక్కోవాలని లోకేష్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల మాదిరిగానే లోకేష్ ను దారుణంగా దెబ్బతీయాలని జగన్ భావిస్తున్నారు. దీంతో మంగళగిరి నియోజకవర్గ వేదికగా ఎత్తుకు పై ఎత్తులు కొనసాగుతున్నాయి.మంగళగిరి నియోజకవర్గం విషయంలో జగన్ కొత్త ప్రయోగాలకు తెర తీశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఉన్న ఆళ్ల రామకృష్ణారెడ్డిని మార్చారు. దీంతో మనస్థాపానికి గురైన ఆళ్ల రామకృష్ణారెడ్డి షర్మిల నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. వైసీపీ హయాంలో మంగళగిరి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని స్ట్రాంగ్ స్టేట్మెంట్ ఇచ్చారు. అయితే ఎక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ.. ఆయన యూటర్న్ తీసుకున్నారు. వైసీపీలో చేరిపోయారు. మంగళగిరి అభివృద్ధి పై కీలక ప్రకటనలు చేశారు. దీంతో నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. అయితే మంగళగిరి నియోజకవర్గ టిక్కెట్ ఇచ్చేందుకే ఆళ్ల రామకృష్ణారెడ్డిని తిరిగి రప్పించారని ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా మురుగుడు లావణ్య పేరును ఖరారు చేశారు. ఆమెనే కంటిన్యూ చేస్తున్నారు. ఆమె ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు కుమార్తె, మరో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల కోడలు.లావణ్య పద్మశాలి సామాజిక వర్గానికి చెందినవారు. నియోజకవర్గంలో చేనేత కార్మికులు అధికం. దీంతో ఏకపక్షంగా ఓట్లు పడతాయని భావించి ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా ఒక అరడజను మందికి ఇన్చార్జిలుగా నియమించి తొలగించారు. ఆళ్ల రామకృష్ణారెడ్డిని తప్పించిన తర్వాత టిడిపి నుంచి రప్పించిన గంజి చిరంజీవికి ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయనే అభ్యర్థి అవుతారని అంతా భావించారు. కానీ ఆయనను తప్పించి లావణ్య కు అప్పగించారు. ప్రస్తుతం లావణ్య ఒంటరి పోరాటం చేస్తున్నారు. ఇక్కడ కోఆర్డినేటర్ గా విజయసాయిరెడ్డి ఉండేవారు. వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి వెళ్లిపోవడంతో ఆయన నెల్లూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేయాల్సి వచ్చింది. దీంతో విజయ్ సాయి రెడ్డి మంగళగిరి చూడడం మానేశారు.పోనీ ఆళ్ల రామకృష్ణారెడ్డి మురుగుడు లావణ్య కు అండగా నిలుస్తారనుకుంటే అది లేకుండా పోతోంది. కనీసం మాటవరసకైనా ఆయన మంగళగిరి నియోజకవర్గం లో కనిపించడం లేదు. అయితే మరో ప్రచారం బలంగా జరుగుతోంది.మంగళగిరి నియోజకవర్గంపై వైసీపీ చేపట్టిన సర్వేలో లోకేష్ స్పష్టమైన పట్టు సాధించారని తేలినట్లు తెలుస్తోంది. అదే సమయంలో మురుగుడు లావణ్య కు మద్దతుగా కీలక నేతలు రాకపోవడంతో.. ఆమె సైతం అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఓడిన సీటును బలవంతంగా అంటగట్టారని.. ఆమె సైతం చేతులెత్తేసినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తానికైతే లోకేష్ ను టార్గెట్ చేసుకుని జగన్ చేసిన వ్యూహాలు ఫెయిల్ అయినట్లు కనిపిస్తున్నాయి. మరి ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయో చూడాలి.

# టి.టీడీపీ, జనసేనలు కమలానికే మద్దతు




హైదరాబాద్, ఏప్రిల్ 8, తెలంగాణ లో లోక్‌సభ ఎన్నికలు అన్ని రాజకీయ పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. అత్యధిక సీట్లు గెల్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీ రేసులో ఉంటే సిట్టింగ్ సీట్లు అయినా గెల్చుకుని .. తమ ప్రభావం తగ్గలేదని నిరూపించాలని బీఆర్ఎస్ పట్టుదలగా ఉంది. జాతీయ స్థాయిలో నాలుగు వందల సీట్లు టార్గెట్ గా పెట్టుకున్న బీజేపీ తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ సారి తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్స్ వస్తాయని గట్టి నమ్మకం పెట్టుకుంది. ఈ క్రమంలో అన్ని వర్గాల మద్దతును పొందేందుకు ప్రయత్నిస్తోంది. గతంలో టీడీపీతో పొత్తులు పెట్టుకుని ఆ పార్టీకి అత్యధిక సీట్లు ఇచ్చిన బీజేపీకి ఈ సారి టీడీపీతో ఏపీలో మాత్రమే పొత్తు పెట్టుకుంది. తెలంగాణలో టీడీపీ పోటీ చేయడం లేదు. ఈ కారణంగా ఆ పార్టీ మద్దతు దక్కే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ పొత్తు పెట్టుకుంది. ఆ పార్టీ పార్లమెంట్ సీట్లలలో పోటీ చేయడం లేదు. అందకే ఆ పార్టీ కార్యకర్తల మద్దతు కూడా బీజేపీకే లభించే అవకాశం ఉంది. లోక్‌సభ ఎలక్షన్ పోటీపై తెలంగాణ తెలుగుదేశం, జనసేన పార్టీ ఎలాంటి ఆసక్తి చూపిచడం లేదు. ఆ రెండు పార్టీల నేతలు కూడా ఇప్పటికే పోటీ ఆలోచన వదిలేసుకున్నారు. ఏపీలో బీజేపీతో పొత్తతులు పెట్టుకున్న క్రమంలో ఈ సారి తెలంగాణలో పోటీ చేస్తున్న బీజేపీకే మద్దతు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బి ప్రస్తుతానికి తెలంగాణ టీడీపీకి అధ్యక్షుడు కూడా లేరు. తెలంగాణలో పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదన్న చంద్రబాబు నిర్ణయంతో విబేధించి బిఆర్ఎస్‌లో చేరిపోగా ఆ స్థానాన్ని అధినేత చంద్రబాబు ఇప్పటి వరకు భర్తీ చేయలేక పోయారు. ఇప్పుడు కాసాని బీఆర్ఎస్ అభ్యర్థిగా చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్నారు. చంద్రబాబుకు ఏపీ రాజకీయాలు కీలకం కావడంతో తెలంగాణపై దృష్టి పెట్టడం లేదు. ముందు ఏపీలో గెలిసచి వద్దామని.. తర్వాత తెలంగాణపై దృష్టి పెడతామని ఆయన నేతలకు సర్ది చెబుతున్నారు. ఏపీలో గెలిస్తే తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టి పోటీ ఇద్దామని చెబుతున్నారు. ఏపీలో బీజేపీతో జట్టు కట్టడంతో ఆ బంధం ఇక్కడ తెలంగాణలోనూ పరోక్షంగా అయినా కొనసాగించడం ఖాయంగా కనిపిస్తోంది. ఏపీలో జమిలీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో ఏపీపైనే దృష్టి కేంద్రీకరించారు ఏపీలో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచిన తీరాల్సిన పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చే దిశగా పావులు కదుపుతున్న చంద్రబాబు తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో పోటీపై అసలు ఆలోచన చేయలేదు. అందుకే బీజేపీకి మద్దతు ప్రకటించాలా లేదా అన్నదానిపైనా చర్చల జరపలేదు. నిజానికి ఖమ్మం ఎంపీ సీటులో టీడీపీ పోటీ చేస్తుందన్న ప్రచారం జరిగింది. అక్కడ బీఆర్ఎస్ పూర్తిగా బలహీనపడింది. కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీలతో అసెంబ్లీ సీట్లలో గెలుచుకుంది. బీజేపీకి బలమైన అభ్యర్థులు లేరు. ఈ కారణంగా కొన్ని సమీకరణాలను చూసి... ఎన్డీఏ కూటమి తరపున టీడీపీని పోటీ చేయించాలన్న ఆలోచన చేసినట్లుగా ప్రచారం జరిగింది. కానీ ఏపీ ఎన్నికలపై నుంచి దృష్టి మరల్చే ఆలోచనలో లేని టీడీపీ పెద్దగా ఆసక్తి చూపించలేదని చెబుతున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా ఈ విషయంలో ఏ మాత్రం చొరవ చూపించలేదు. అందుకే.. తెలంగాణలో టీడీపీ, బీజేపీ పోటీ అనే మాట ఈ ఎన్నికల్లో వినిపించడం లేదు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పొత్తులు ఏపీకే పరిమితమని.. తెలంగాణకు సంబంధం లేదని జనసేన పొత్తు గురించి ప్రస్తావన వచ్చినప్పుడు ప్రకటించారు. అయితే జనసేన, టీడీపీ ఎన్డీఏ కూటమిలో భాగస్వామి కావడంతో.. ఒక్క రాష్ట్రానికి పరిమితం కాకుండా.. అన్ని చోట్లా వారి పొత్తులు ఉంటాయని చెబుతున్నారు. కానీ పోటీ చేయడానికి టీడీపీ, జనసేననే ఆసక్తి చూపించలేదని అనుకోవచ్చు. అదే సమయంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓ ప్రత్యేకమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అయితే ఈ రెండు పార్టీలు తెలంగాణలో బీజేపీకి అధికారికంగా మద్దతు ప్రకటిస్తాయా లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. నామినేషన్ల గడువుకు ఇంకా రెండు వారాలు ఉంది. ఆ తర్వాత అధికారికంగా ప్రచారం ప్రారంభమవుతుంది. ఎన్నికలకు ముందు అయినా ఈ రెండు పార్టీలు అధికారికంగా బీజేపీకి మద్దతు ఇవ్వాలని తమ సానుభూతి పరులను కోరే అవకాశాలు ఉన్నాయి.టీడీపీ కోసం ప్రచారం చేసేందుకు తెలంగాణ టీడీపీ నేతలు ఏపీకి వెళ్తున్నారు. పలు జిల్లాలు పర్యటించిన అధినేత చంద్రబాబుకు మద్ద తు తెలిపి ఆయన ప్రచార కార్యాక్రమాల్లో పాల్గొని వచ్చారు. తాజాగా మరో సారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నూ పాల్గొనుటకు వెళ్లున్నారు. టిడిపి సీనియర్ నేతలు బక్కని నర్సింహులు, సీనియర్ నేత నన్నూరి నర్సిరెడ్డి, మాజీ ఎంఎల్ఏ కాట్రగడ్డ ప్రసూనతో పాటు మరింత మంది సీనియర్లు ఏపి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఏపీలో గెలిచిన తర్వాత తెలంగాణపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. అంటే తెలంగాణలో ఎన్నికలపై మాత్రం టీడీపీ ఎలాంటి ఆశలు అంచనాలు పెట్టుకోవడం లేదు.

# మార్గ మధ్యలోనే ప్రసవం

అల్లూరి ,అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ చీడివలస కొండ శిఖర గ్రామం కోదు ఆదివాసి గిరి 22 కుటుంబాలు 120 మంది జనాభా కలిగిన గ్రామం. ఈ గ్రామంలో ఈరోజు తెల్లవా రుజాము ఉదయం4 పురిటి నొప్పులు రావడంతో. ఉదయం 6 గంటలకు 108 ఫోన్ చేయగా ఉదయం ఎనిమిది గంటలకి గ్రామానికి కిలోమీటర్ దూరం వరకు అంబులెన్స్ వచ్చింది.

# జిల్లా ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు..

## తెలియజేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కె బాబురావు..



కర్నూలు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08 విభారె న్యూస్. జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు శ్రేయోభిలాషులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె బాబురావు శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదిన శుభాకాంక్షలుతెలియజేశారు. హిందువుల తెలుగు సంవత్సరం ఉగాది పండుగతో మొదలవు తుందని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో పండుగను భక్తి శ్రద్ధలతో ఉగాది పచ్చడితో, పిండి వంటలతో ఆనందంగా జరుపుకొని భగవంతుని కృపకు పాత్రులు కాగలరని సంపూర్ణమైన ఉగాది ఆనందాల యుగాదిలోకొత్త ఆశలు..!కొత్త ఆశయాలు..!కొత్త ఆలోచనలతో..!ఈ ఉగాది నుంచి మీ జీవితాలు ఆనందమయం కావాలని బాబురావు ఆకాంక్షించారు

## చలివేంద్రంను ప్రారంభించిన బుట్టా ప్రతుల్..



ఎమ్మిగనూరు ఏప్రిల్ 8 విభారే న్యూస్.ఎమ్మిగనూరు పట్టణంలో కమిటీ రోడ్డు గంజహల్లి బడేసాబ్ తాత దర్గా ఎదురుగా వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చుటకు యు.కె రాజశేఖర్ అద్వర్యంలో మాల మహానాడు వారిచే ఏర్పాటు చేయబడిన చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మిగనూరు నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక తనయుడు బుట్టా ప్రతుల్ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ మాల అశోక్ కుమార్,రాయల సీమ అధ్యక్షులు గడ్డం నాగేంద్ర,కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎం కేశవ. తాలుక వర్కింగ్ ప్రెసిడెంట్ జి మురళీకృష్ణ,తాలూకా అధ్యక్షులు కేఎం. హుస్సేన్అప్ప ,తాలూకా ప్రధాన కార్యదర్శి ఎం. ఓబులేష్,వీరేశ్ ఆచారి,మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ నౌమాన్ ను కలసిన తెలుగుదేశం నాయకులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 08-నంద్యాల పట్టణంలో సోమవారం సీనియర్ రాజకీయ నాయకులు, ముస్లిం మైనారాటి నేత, ఎపిపిఎస్ సీ. మాజీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ , నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థిగా తన కూతురు డాక్టర్ . బైరెడ్డి శబరి, నంద్యాల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్ ఎమ్ డి ఫరూక్ లు పోటీచేస్తున్నారని వారి విజయానికి సహకరించగలరని డాక్టర్ . నౌమాన్ ను బైరెడ్డి కోరగా పూర్తిసహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు. రమణారెడ్డి. విశ్వనాథ్ రెడ్డి. శివనాగిరెడ్డి. తదితరులు ఉన్నారు.

# ప్రజలకు మంచి చేసే వైఎస్సార్సీపీకే ఓటు వేయండి...

## ఎమ్మిగనూరు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ మతి బుట్టా రేణుక..



ఎమ్మిగనూరు ఏప్రిల్ 08 విభారె న్యూస్.సోమవారం రోజు ఎమ్మిగనూరు పట్టణం లో 16 వ వార్డ్ లో ఎన్నికల ప్రచారం లో రాబోయే ఎన్నికలలో ప్రజలకు మంచి చేసే వైఎస్సార్సీపీకే ఓటు వేయాలని ఎమ్మిగనూరు వైఎస్సార్సీపీ అభ్యర్థి శ్రీ మతి బుట్టా రేణుక కోరారు. సోమవారం ఉదయం ఎమ్మిగనూరు పట్టణం లో నీ 16 వ వార్డ్ కౌన్సిలర్ వాహీద్, పార్టీ శ్రేణులుతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించగా.. వార్డ్ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. వార్డ్ ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వెయ్యాలని అభ్యర్థించారు.ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ మతి బుట్టా రేణుక కి వార్డ్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరికీ సంక్షేమ పథకాలను దళారులు లేకుండా నేరుగా చేరవేసిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని, ఆపదలో ఉన్నవారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎనికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి తనను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా, కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్యను భారీ మెజార్టితో గెలిపించాలని కోరారు.ఈ ప్రచారం లో బుట్టా శివ నీలకంఠ,వార్డ్ నాయకులు బజారిరెడ్డి,జిక్రియ,ఖలీల్,గోవిందు,ఖాదర్,పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, పట్టణ ప్రతినిధి సునీల్ కుమార్, వక్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్,మున్సిపల్ కో ఆప్షన్ మెంబెర్ కొండాపూరి అబ్రార్, కౌన్సిలర్లు కాశీం బేగ్,రాజారత్నం,డిష్ కేశవరెడ్డి,సుధాకర్,ఇన్చార్జులు రామాంజి రెడ్డి, గట్టు ఖజా, నాయకులు ఖిబులా హుస్సేని,ఇళయకత్,కే.యమ్ బాషా,యూసుఫ్, మంజునాథ్,బుట్టా యూత్ నాయకులు ఫయాజ, ఉబెద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసిపి, జనసేన నాయకులు కార్యకర్తలు..

## సూపర్ 6 పథకాలకు ఆకర్షితులై టిడిపిలో చేరిన నాయకులు కార్యకర్తలు...



ఎమ్మిగనూరు ఏప్రిల్ 8 విభారె న్యూస్..సోమవారం రోజు ఎమ్మిగనూరు పట్టణంలోని 12వ వార్డు,9 వ వార్డులకు చెందిన వైసిపి,జనసేన పార్టీలకు చెందిన ఉసేనప్ప నాయుడు, శ్రీనివాసులు నాయుడు,రియాజ్, రసూల్, పరమేష్, వీరేష్, రాజు, వెంకటేష్, దుర్గా, మహేష్, సుందర్ రాజు, ఇక్బాల్, రహిమాన మరియు వారి అనుచరులు సుమారు 100 మంది యువకులు 12వ వార్డు టిడిపి అధ్యక్షులు అల్తాఫ్ ఆధ్వర్యం లో ఎమ్మిగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డా బి వి జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టిడిపి పార్టీలోకి చేరినారు. ఈ సంధ్భంగా వీరు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్నపూర్ణ అని పేరు ఉండేదని కానీ వైసిపి పార్టీ తుగ్లక్ ముఖ్యమంత్రి హయాంలో ఆంధ్రప్రదేశ్ అంటే గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని పేర్కొన్నారు. ఇటీవల టిడిపి - జనసేన ఉమ్మడి పార్టీలు ప్రకటించిన సూపర్ 6 పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సంధ్భంగా వీరికి టిడిపి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఎమ్మిగనూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి డా బి.వి.జయానాగేశ్వర రెడ్డి ఆహ్వానించారు.

## టిడిపి కండువా కప్పుకున్న సోగనూరు వైసిపి నాయకులు..




ఎమ్మిగనూరు ఏప్రిల్ 8 విభారె న్యూస్.ఎమ్మిగనూరు మండలంలోని సోగనూరు గ్రామానికి చెందిన వైసిపి పార్టీ నాయకులు ఆలూరు భీమన్న, చిన్న రంగన్న, చాంద్, ఆదిశేషు, నడిపోడు,రమేష్, పెద్ద రంగన్న, పులెప్ప, బతకన్న, రామాంజని, బాబు, మాభాషా, రాజుభయ్, తిమ్మాపురం ఈరన్న వారి అనుచరులు సుమారు 50 మంది సోగనురు గ్రామ టిడిపి కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డా బి వి జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరినారు. ఈ సంధ్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఎన్డిఏ కూటమి పార్టీ ప్రవేశ పెట్టిన వివిధ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలోకి చేరినట్లు వారు ప్రకటించారు. ఈ సంధ్భంగా వీరికి టిడిపి పార్టీ కండువాలుకప్పిపార్టీలోకి సాదరంగా ఎమ్మిగనూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి డా బి.వి. జయానాగేశ్వరరెడ్డిఆహ్వానించారు..

# వైఎస్ జగనన్నతోనే సంక్షేమ పాలన..



నందవరం ఏప్రిల్ 8 విభారే న్యూస్..సోమవారం రోజు ఉదయం నందవరం మండలం మిట్ట సోమాపురం గ్రామంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక తనయుడు బుట్టా ప్రతుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పాలన కొనసాలంటే మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మా అమ్మ ని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని వైఎస్సార్సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్ పిలుపునిచ్చారు.ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. అధికార దాహంతో టీడీపీ నాయకులు చెప్పే మోసపూరిత హామీలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.ఈ ప్రచారం లో పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, బీసీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు విరుపాక్షి రెడ్డి,సర్పంచ్ నరసింహులు,మాజీ సర్పంచ్ లింగన్న, బొజ్జన్న, నరసింహులు, రామదాసు, యాకోబు తాయన్న, స్వామి దాసు, రామాంజనేయులు, బోయ శ్రీను, చిన్న నరసింహులు, పెద్ద నరసింహులు,గురజాల సర్పంచ్ వీరస్వామి,నరసింహారెడ్డి, సోమలగూడూరు వెంకటేశ్వర రెడ్డి, జాన్,పోనకలదిన్నె సర్పంచ్ నాగరాజ్,కార్యకర్తలు,అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

## శ్రీ నరసింహ ఈరన్నస్వామి దేవస్థానంలో నేడు పంచాంగ శ్రవణం..



కౌతాళం ఏప్రిల్ 8 విభారే న్యూస్.. కౌతాళం మండలంలోని ఉరుకుందలో వెలసిన శ్రీ నరసింహ ఈరన్నస్వామి దేవస్థానంలో నూతన క్రోధీ నామ సంవత్సర ఉగాది పర్వదిన సందర్భంగా నేడు దేవస్థాన అనివేటి మండపం నందు ఉదయం 10 గంటల నుండి దేవస్థాన అర్చకులు, ఆలయ సిబ్బంది సమక్షంలో పంచాంగ శ్రవణం నిర్వహించబడునని ఆలయ అధికారులు సోమవారం తెలిపారు.

## నంద్యాల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గోపవరం గోకుల్ కృష్ణ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 08-పట్టణంలో గల డీసీసీ కార్యాలయంలో గోకుల కృష్ణారెడ్డి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా, లేకపోయినా కాంగ్రెస్ పార్టీ వెన్నంటే ఉన్న కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరియు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నంద్యాల నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందని, తనకు అవకాశం ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకుంటానని, నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కలుపుకొని పోయి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలకు ఏ కష్టం ఎదురైనా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఒక్క సార్వత్రిక ఎన్నికలే కాకుండా లోకల్ బాడీ ఎన్నికలలో కూడా విజయం సాధిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న 9 గ్యారంటీలను ప్రజల్లోకి బాగా తీసుకెళ్తామని, ప్రచారం ముమ్మరంగా కొనసాగించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంటే అనాది కాలం నుంచి మంచి పేరు ఉందని, అయితే అనివార్య కారణాల వల్ల పార్టీకి ఆదరణ తగ్గిందని, ఇప్పుడు పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే తన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర విభజనకు కేవలం కాంగ్రెస్ పార్టీనే కారణం అని చెప్పడం సరికాదని, అందరి నిర్ణయం, మద్దతు కారణంగానే విభజన జరిగిందని అన్నారు. మరి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా ప్రత్యేక హోదా ఇప్పటివరకు ఎందుకు సాధించలేకపోయామని ప్రశ్నించారు. ఇప్పుడున్న నాయకులందరికీ రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో అక్కడ కేంద్రంలో ఇక్కడ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేయబోతోందని గోకుల్ కృష్ణ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190